క్లుప్తంగా

అడవులను కాపాడాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రవీంద్రబాబు

మర్రిపాడు: అడవులను కాపాడాలని కదిరినాయుడుపల్లి సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి కె రవీంద్రబాబు అన్నారు. మండలంలోని సింగనపల్లి బీసీకాలనీలో అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అడవుల్లో అగ్నిప్రమాదాలు కాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మర్రిపాడు వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణయ్య, ఎఫ్‌బీఓ శివకుమారి, శివరామరాజు, మల్లికార్జున, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

39 మందికి వైద్యపరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువులో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యాధికారిణి కరిష్మా 104 వాహన సేవల్లో భాగంగా 39 మంది రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె దీర్ఘకాలిక రోగులు, సాధారణ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మధ్యాహ్నం శిబిరానికి రాలేక మంచానికే పరిమితమైన రోగులను పరీక్షించారు. ప్రభుత్వం ప్రజారోగ్యం దృష్ట్యా అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, ఏఎన్‌ఎం సురేఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు వేలం



వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

కావలి రూరల్: కావలి సెబ్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ఆటోలు, 11 ద్విచక్ర వాహనాలకు మొత్తం ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1.73 లక్షలు కాగా వేలంలో మొత్తం రూ. 3.78 లక్షల వచ్చిందని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 119 శాతం అదనంగా ఆదాయం వచ్చిందన్నారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

వింజమూరు: మండలంలోని శంఖవరంలో గురువారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు దేవస్థాన ధర్మకర్త గోతం నారాయణ బుధవారం తెలిపారు. గురువారం అశ్వవాహన సేవ, శుక్రవారం హనుమంతు సేవ, శనివారం గరుడ సేవ, ఆదివారం హయ, గజ ఉత్సవం, సోమవారం ఉదయం కల్యాణోత్సవం, వసంతోత్సవం, సాయంత్రం పార్వేట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ ఆత్మకూరు అసెంబ్లీ కన్వీనర్‌గా సుధాకర్



ఆత్మకూరు: బీజేపీ ఆత్మకూరు అసెంబ్లీ కన్వీనర్‌గా కరటంపాటి సుధాకర్‌ను పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. బుధవారం ఆ మేరకు ఆదేశాలు అందినట్లు సుధాకర్ తెలిపారు. అందరు కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ మరింత పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని సుధాకర్ తెలిపారు.

హైఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

ఆత్మకూరు: పట్టణంలోని బ్రాహ్మణవీధి, పెద్ద మసీదు వీధిల్లో హై ఓల్టేజీ రావడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, మిక్సీలతో సహా పలు గృహోపకరణాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం 4 గంటల సమయంలో ఒక్కసారిగా హైఓల్టేజీ వచ్చిందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటిలో సుమారు రూ.2 లక్షలకు పైగా గృహోపకరణాలు, అనిల్‌కుమార్, జమీర్, రవీంద్రరెడ్డి తదితర వారి ఇళ్లలోనూ గృహోపకరణాలు కాలిపోయినట్లు, అధికంగా పొగలు వచ్చినట్లు బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ లైన్లను, హైఓల్టేజీ నష్టాన్ని పరిశీలించారు.

బయట నిద్రిస్తుండగా ఇంట్లో చోరీ

దుత్తలూరు : ఇంట్లోని వారు ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన మండలంలోని బ్రహ్మేశ్వరంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సూరె వెంకట్ కుటుంబం రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి సరుడు, ఉంగరం, పట్టీలతో పాటు సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. ఇంట్లో అలికిడి కావడంతో నిద్రలేచి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే సరికి దొంగలు పారిపోయారు. మూడు సవర్ల ఆభరణాలు దోచుకెళ్లారని బాధితుడు తెలిపాడు. ఎస్సై బాజిరెడ్డి బుధవారం విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- ఆసరా కింద 533 పొదుపు గ్రూపులకు రూ.98.81 కోట నిధులు పంపిణీ
- ఆర్థిక భద్రత కల్పించే దిశగా పథకాలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు నగదు మెగా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి): రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళా సాధికారత సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం దగదర్తి మండలం శ్రీరామపురంలో 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆసరా, బ్యాంకు రుణాల సాయంతో స్వయం ఉపాధి పొందేలా మహిళలు ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను పరిశీలించారు. పొదుపు సంఘాల సభ్యులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలో 553 పొదుపు సంఘాలకు సంబంధించి 6,028 మంది మహిళలకు లబ్ధి చేకూరేలా రూ.4.21 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటి వరకు నియోజకవర్గంలో మూడు విడతలుగా మొత్తం 4,367 సంఘాలకు రూ.98.81 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్క దగదర్తి మండలంలోనే రూ.12.51 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలకు అండగా నిలిచేందుకు, వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచి సాధికారత సాధించే దిశగా చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు వివరించారు. ఆసరా పథకం కింద ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాకుండా స్వయం ఉపాధి పథకాల ద్వారా సుస్థిర ప్రగతి సాధించేందుకు కూడా పలు పథకాలు, శిక్షణా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన స్వయం సహాయక సంఘాలను తిరిగి మనుగడలోకి తీసుకువచ్చి మహిళలకు అండగా నిలిచిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకర్ల నుంచి కూడా సాయం అందకుండా చంద్రబాబు పెట్టిన ఇబ్బందులు మహిళలు ఇంకా మర్చిపోలేదని తెలిపారు. అప్పట్లో మహిళలను, మహిళా సంఘాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబు కొత్తగా మహిళా సంఘాలను ఉద్ధరిస్తానని హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మహిళలు

రానున్న ఎన్నికల్లో చంద్రబాబుతో పాటు పచ్చ మీడియాకు కూడా ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, కావలి ఏఎంసీ చైర్మన్ ప్రసాద్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలేపల్లి అనిల్, ఎంపీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ నేతలు వివేక్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు

- వైదికంగా సంప్రోక్షణ



ఆలయంలో ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేస్తున వేదపండితులు

సంగం: త్రివేణి సంగమం ఒడ్డున కొలువైన సంగమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి తాపడాలు ఏర్పాటు చేసి బుధవారం సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గాలిగోపురం నిర్మించిన అనంతరం సంగమేశ్వరుడు, కామాక్షితాయి వద్ద ధ్వజస్తంభం కొయ్యలను ఏర్పాటు చేశారు. చెన్నై నగరంలో ధ్వజస్తంభాలకు రాగి తాపడాలు చేసిన తదుపరి ఆలయంలోని కొయ్యలకు అమర్చారు. బద్వేల్ వేద పండితులు కనుమళ్లగిరి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు టంగుటూరు గోపాలకృష్ణమూర్తి పండితులతో కలిసి నూతన ధ్వజస్తంభానికి సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన హోమం నిర్వహించి పూర్ణాహుతి వేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు కర్నాటి రవీంద్రరెడ్డి దంపతులు, కోటు కరుణాకర్‌రెడ్డి, ఆలయం మాజీ ధర్మకర్త మాగం గిరి, గ్రామీణులు భారీ సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్వారీ వద్దని ఎమ్మెల్యేకు వినతి



క్వారీ విషయమై ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: సంగం కొండపై 2.45 హెక్టార్లలో క్వారీ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను నిలువరించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి వినతి చేశారు. స్థానిక నేత కంబాత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మెటల్ క్వారీ వల్ల ప్రజలకు హాని కలుగుతుందని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పొల్యూషన్ కంట్రోల్ విభాగం ఈఈ రాజశేఖర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇటీవల క్వారీ నిర్వహణపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాప్రతినిధులు, ప్రజలు తిరస్కరించారని, ఆ మేరకే ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు రావుల ప్రసాద్‌గౌడ్, షేక్ కరిముల్లా, పిట్టు పట్టాభిరామిరెడ్డి, పట్టెంవేణు తదితరులు ఉన్నారు.

చిన్నారి ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



దేవాన్ష్ తల్లిదండ్రులకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేసిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటకు చెందిన కేతుబోయిన సురేష్ కుమారుడు చిన్నారి దేవాన్ష్‌కు కాక్లియర్ ఇంప్లాంటేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.5.30 లక్షలు అయింది. బుధవారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ మంజూరు ఉత్తర్వులను దేవాన్ష్ తల్లిదండ్రులకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. చిన్నారి దేవాన్ష్ వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత పులిమి వెంకటరమేష్‌రెడ్డి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరు చేయించడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మెట్ట ప్రాంత జాలర్లను ఆదుకోవాలి



ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుబ్బరాయుడు

ఆత్మకూరురూరల్: జిల్లాలో 29 మెట్ట ప్రాంత మండలాల్లో సంప్రదాయ మత్స్యకారులు ఉన్నారని ప్రభుత్వ ప్రోత్సాహకాల విషయంలో తమను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు కోరారు. నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అట్టడుగు కులాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన సమీక్ష సమావేశంలో వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. తీర ప్రాంతాల్లోని మత్స్యకారులకు వేట నిషేధిత సమయాల్లో జీవనభృతి కింద ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తుందన్నారు. మెట్ట ప్రాంతాల్లోని జాలర్లు ఏడాదిలో మూడు నెలలు మాత్రమే చెరువులు, కుంటలు, జలాశయాల్లో చేపలు పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని మిగిలిన సమయాల్లో కుటుంబ పోషణకు కూలి పనులకు సైతం వెళ్లి పడరాని పాట్లు పడుతున్నామన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మహిళకు అందిన ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో పార్టీలకతీతంగా ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. తుమ్మలపెంటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఇప్పటి వరకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు భారీ స్థాయిలో నివేశన స్థలాలు పంపిణీ చేయడంతో పాటు పక్కాగృహాలు నిర్మించే బాధ్యత కూడా ప్రభుత్వమే చేపట్టిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే తీసుకువెళ్లడం, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేసి చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడం, ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేయడం, తదితర పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గజవాహనంపై రాములోరు



ఆత్మకూరు: పట్టణంలోని కోదండ రామాలయంలో బుధవారం కోదండరాముడు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారి ఉత్సవ మూర్తిని సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో గజమాలలతో ఆకర్షణీయంగా అలంకరించారు. గ్రామోత్సవం అంగరంగ వైభవంగా మేళతాళాలు, బాణసంచా వేడుకలు, యువత డీజే నృత్యాలతో సాగింది.

స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు

ఆత్మకూరురూరల్: మండలంలోని కోటపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండ రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా బుధవారం విశేషహోమాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. అర్చకులు పేట హజరత్తయ్య, ప్రతిష్టాచార్యులు ఐలావజ్జుల రామకృష్ణ శాస్త్రి, నాగరాజశర్మ, శివకుమార్ శాస్త్రి, తదితరుల ఆచార్యత్వమున విశేషంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

హనుమంతుడిపై సీతారాముల చిద్విలాసం



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడు కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతా సమేత రామ, లక్ష్మణులు బుధవారం హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. పడమర వీధికి చెందిన ఉభయకర్తలుగా వైభవంగా స్వామి వారి నవమి వేడుకలను నిర్వహించారు.

నవమి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

సోమశిల: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అనంతసాగరం ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నవమి వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న వారు శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో ఉత్సవాలకు ఎటువంటి విఘాతం లేకుండా నిర్వాహకులు ముందుగా సంప్రదించి అనుమతులు పొందాలన్నారు.

బీజేపీ మండల కన్వీనర్ రాజీనామా

బిట్రగుంట: బీజేపీ మండల కన్వీనర్ పసుపులేటి వెంకటేశ్వర్లు పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్లుగా బీజేపీ మండల కన్వీనర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు, ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాహ్మణ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

- శ్రీకాంత్ శర్మ, దేవదాయశాఖ రాష్ట్ర సలహాదారు



మాట్లాడుతున్న శ్రీకాంత్ శర్మ

ఆత్మకూరు: ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని దేవదాయశాఖ రాష్ట్ర సలహాదారు శ్రీకాంత్‌శర్మ అన్నారు. నెల్లూరు, సంగం, ఆత్మకూరుల్లోని పలు దేవాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం పట్టణంలోని శివాలయంలో అర్చకులు, అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మతో కలిసి విలేకర్ల సమావేశం మాట్లాడారు. కరోనా కష్టకాలంలో రెండు నెలలకుపైగా డివిజన్ పరిధిలోని అనేక బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాలు దాతల సహకారంతో అందజేశారన్నారు. ఆలయాల్లో పనిచేసే బ్రాహ్మణుల జీతభత్యాల విషయంలో ప్రభుత్వం ఎంతో ఉదాశీనంగా వ్యవహరిస్తుందని, జీతాలు ఠంచనుగా వచ్చేలా దేవదాయ శాఖ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక పురోహిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారా శ్రీధర్ శర్మ, కార్యదర్శి ముప్వా ప్రసాద్, శంకర్, సీహెచ్ మధుసూదన్‌శాస్త్రి, రామయ్య శాస్త్రి, వాకాటి మురళీ కృష్ణమాచార్యులు, చక్రవర్తి, కె కిషోర్, మహిళా నాయకులు అపర్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే అగ్ర తాంబూలం



ఆసరా మెగా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాల్లో, రాజకీయ పదవుల్లో మహిళలకే అగ్రతాంబూలం ఇస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మహిళలకు మూడో విడత నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకాంక్షించారని, ఆయన ఆశయాలను తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నాడన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపిస్తున్న విషయాన్ని మీరే గుర్తించారన్నారు. మహిళలు తలెత్తుకుని తిరిగేలా అన్ని రంగాల్లో అగ్రపీటం వేస్తున్న ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చేజర్ల మండలంలో మూడో విడత కింద 500 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రూ.3.21 కోట్ల నగదు జమ చేశారని, మొత్తం మూడు విడతల్లో రూ. 9.6 కోట్లు అందజేసినట్లు వివరించారు. పలువురు లబ్ధిదారులకు పొట్టేళ్ల పిల్లలను పంపిణీ చేశారు. ఆసరాలో లబ్ధిపొందిన స్వయం సహాయక సంఘాల మహిళల స్టాల్స్‌ను పరిశీలించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో మూడు విడతల్లో 3,178 స్వయం సహాయక సంఘాల్లోని 33,369 మంది అక్కచెల్లెమ్మలకు రూ.75.88 కోట్ల ఆసరా నగదును అందజేసి ఆర్థికంగా ఆదుకొంటున్నారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పూనూరు రామమనోహర్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, ఎంపీడీఓ విజయలలిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బాలగంగాధర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బి వీరరాఘవరెడ్డి నాయకులు ఎన్.నాగిరెడ్డి, పెంచలయ్య, ఎం.పెంచలనాయుడు ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వైకేపి ఏపీఎం చీర్ల సుజన తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలి

- ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి, తదితర సమస్యలపై చర్చ సాగింది. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించి ప్రతి పేదవాడికి వంద రోజులు కచ్చితంగా పని కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి స్థలం లేని, ఇల్లు లేని ప్రతి ఒక్కరిని గుర్తించి ఇంటి స్థలం కల్పించాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, నేలటూరు శారమ్మ, ఏఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు లక్ష్మీకాంతమ్మ, పీసీ అల్లూరురాజు, వెంకటసుబ్బమ్మ, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి తావులేని పారదర్శక పాలన

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ఆదూరుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుకి అందించిన ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి

చేజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించానని హామీ ఇచ్చారు.

పార్టీ మారడం అనేది అపోహ

తమ కుటుంబం వైఎస్సార్ కుటుంబానికి విధేయంగా ఉందని ఇరు కుటుంబాల మధ్య అవినాభావ సంబంధాలు ఉన్నాయని, తాను పార్టీ మారనున్నట్లు కొందరు అభూత కల్పనలు సృష్టిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. తాము పార్టీ, జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలకు కట్టుబడే ఉన్నామన్నారు. అప్పట్లో తమ తండ్రి నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన పదవిని తృణ పాయంగా రాజీనామా చేసి జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లా ప్రజల ఆదరాభిమానాలతో ఎంపీ మళ్లీ హాట్రిక్ విజయం సాధించారని, తన సోదరుడు దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి సైతం రెండు మార్లు ఆత్మకూరు నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గతేడాది జరిగిన ఉప ఎన్నికల్లో తనను ప్రోత్సహించి ఎమ్మెల్యే సీటు ఇచ్చారని, 80 వేల ఓట్ల పైగా మెజార్టీతో విజయం సాధించినట్లు తెలిపారు. అలాంటి తమ కుటుంబం ఎప్పటికి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నిలుస్తుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తెలిపారు. అన్ని మండల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 11న ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలో జేసీ, ఆర్డీఓతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

ఏడీఎఫ్‌తో డిజిటల్ క్లాసు రూముల ఏర్పాటు

ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన డెవలప్‌మెంట్ ఫోరమ్ ద్వారా పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 60 క్లాస్ రూమ్‌లను డిజిటల్‌గా మార్చేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా అధికార ప్రతినిధి పూనూరు రామనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మండలంలోని కాకివాయి గ్రామానికి చెందిన నాగినేని వెంకటేశ్వర్లుకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి దృష్టికి స్థానికులు వెంకటేశ్వర్లు పరిస్థితిని వివరించడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

భర్తపై భార్య దాడి

ఆత్మకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మకూరు ఎల్‌ఆర్‌పల్లికి చెందిన హజరత్తయ్యపై తన భార్య అరుణమ్మ దాడిచేసి గాయపరిచిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సైలు సాయిప్రసాద్, రాజేష్ సమాచారం మేరకు.. హజరత్తయ్య విశ్రాంత ఉద్యోగస్తుడు. ఇతని భార్య అరుణమ్మ భర్తతో తరచూ గొడవ పడుతోంది. బుధవారం సాయంత్రం ఆమె భర్తపై దాడి చేసి గాయపరిచిందని పోలీసులకు ఫిర్యాదు అందింది.